క్లుప్తంగా

నేడు టీజీబీకేఎస్ సమావేశం



మాట్లాడుతున్న కాపు కృష్ణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సమావేశం మంగళవారం భూపాలపల్లిలో జరగనుండగా యూనియన్ భవిష్యత్ కార్యాచరణ, కార్మిక సమస్యలపై చర్చిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ తెలిపారు. రామవరంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూనియన్ నిర్మాణం, కార్యక్రమాల నిర్వహణపై చర్చ జరగనున్న సమావేశానికి నాయకులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. కూసన వీరభద్రం, గడప రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

జూలూరుపాడు: మాలమహానాడు ఆత్మీయ సమ్మేళనంలో ఆదివారం నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బుడిపూడి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా బోగిళ్ల రమేష్, కార్యదర్శిగా పోతురాజు రామారావు, కన్వీనర్‌గా వల్లమల్ల సామేలు, వర్కింగ్ ప్రెసిడెంట్ బుడిపూడి ప్రతాప్, సహాయ కార్యదర్శిగా ఇల్లంగి సుందర్‌రావు, కోశాధికారులుగా బోడా నాగరాజు, పత్తిపాటి యోహాను, పణితి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అదేవిధంగా మండల యూత్ కమిటీ అధ్యక్షుడిగా కళ్లోజి దినేష్, ఉపాధ్యక్షుడిగా రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్ని కుట్రలు చేసినా ధర్మమే గెలుస్తుంది..



మాట్లాడుతున్న గురునాథం

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తులు ఎన్ని కుట్రలు చేసినా ధర్మమే గెలుస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు చెంగల గురునాథం అన్నారు. సోమవారం జూలూరుపాడులో మాట్లాడారు. జనాభా నిష్పత్తి ప్రకారమే తమ వాటా అడుగుతున్నామని, మా పోరాటంలో న్యాయం ఉండటం వల్లే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. దిబ్బెందుల సాయి కుమార్, కాకటి వెంకట్, మోదుగు శివకుమార్, దంసలపూడి సంతోష్, సాయి కిరణ్, పాల్గొన్నారు.

మంజువాణి మృతికి సంతాపం

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.మంజువాణి (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లా గ్రంథాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఉద్యోగులు మాట్లాడుతూ.. విధుల పట్ల అంకితభావం కలిగిన మంజువాణి మరణం బాధాకరమంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

బుగ్గవాగు పూడిక తొలగింపు షురూ..

ఇల్లెందు: బుగ్గవాగు పూడిక తీసే పనులకు శ్రీకారం చుట్టారు. సోమవారం ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు బుగ్గవాగును సందర్శించి పూడిక తీసే పనులను పరిశీలించారు. మున్సిపల్ కౌన్సిలర్లు సయ్యద్ ఆజమ్, అంకెపాక నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తదితరులు ఉన్నారు.

ధ్యాన్‌చంద్.. క్రీడాకారులకు ఆదర్శం



క్రీడాకారులతో కాశీహుస్సేన్

కొత్తగూడెంటౌన్: హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ క్రీడాకారులకు ఆదర్శం అని రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.కాశీహుస్సేన్ అన్నారు. జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కొత్తగూడెం త్రీఇంక్‌లైన్ తెలంగాణ క్రీడా ప్రాంగణంలో జిల్లాస్థాయి అండర్-14 పోటీలను నిర్వహించారు. రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఐ.ఆదినారాయణ ఈ పోటీలను ప్రారంభించారు. పి.కాశీహుస్సేన్ మాట్లాడుతూ.. రెజ్లింగ్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి దాదాపుగా 60 మందికి పైగా పోటీల్లో పాల్గొన్నారని బాలబాలికలకు వివిధ కేటగిరిల్లో పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇ.మొగిలి, కె.శ్రీనివాస్, జి.కృష్ణ, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉట్టి కొట్టి ఊరంతా సంబురాలు

- ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు
- ఆలయాల్లో, ఇళ్లల్లో భక్తులు ప్రత్యేక పూజలు
- శ్రీకృష్ణుడు, రాధాగోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులు



ఇల్లెందురూరల్: లచ్చగూడెంలో ఉట్టి కోసం కర్ర మీదకు ఎగబాకుతున్న యువకులు

కొత్తగూడెంటౌన్: చిన్నారులకు శ్రీకృష్ణుడు, రాధాగోపికల వేశధారణలో అందంగా ముస్తాబు చేసి తల్లిదండ్రులు మురిసిపోయారు. ఆలయాల్లో, ఇళ్లల్లో భక్తిశ్రద్ధలతో ప్రజలు సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువత, చిన్నారులు పాల్గొని పండుగను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు శ్రీకృష్ణుడి కోసం ప్రత్యేకంగా కోలాటాలు ఆడుతూ, భక్తిగీతాలు పాడుతూ, నృత్యాలు చేశారు.

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు ఇళ్లలో శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహించారు. పిల్లలను కృష్ణుడు, రాధలుగా అలంకరణలు చేసి మురిసిపోయారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో ఉట్టి కార్యక్రమాలు రాత్రి పొద్దుపోయే వరకు జరుగుతూనే ఉన్నాయి.

పాల్వంచరూరల్: శ్రీకృష్ణ జయంతి సందర్భంగా సోమవారం మండలంలో పలుగ్రామాల్లో భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. సూరారం, పాండురంగాపురం, రెడ్డిగూడెం, నాగారం తదితర గ్రామాల్లో ఉట్టి కట్టి ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: కృష్ణాష్టమి వేడుకలను మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. పలువురు చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలలో అలరించారు.

జూలూరుపాడు: మండలంలోని ప్రజలు శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కాకర్ల పాలగుట్టపై ఉన్న శ్రీ రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, గోత్రానామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఆదిశేషుడు విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసంతాన వేణుగోపాల స్వామి వారిని కొత్తగూడెం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.విజయ దుర్గాలక్ష్మి, ప్రభాకర్ దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇల్లెందు: పట్టణంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన భక్తులు ఉపవాసదీక్ష ఆచరించారు. సాయంత్రం వేళలో పలు గ్రామాల్లో ఉట్టి కొట్టే సంబురాలు జరుపుకున్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. నాయకులగూడెం గ్రామంలోని శ్రీకృష్ణుణి ఆలయంలో ఆదివాసీలు శ్రీకృష్ణుణికి పంచామృతాలతో అభిషేకం చేసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు తమ చిన్నారులను శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలంకరించి మురిసిపోయారు. పలు గ్రామాల కూడళ్లలో కర్రకు ఫలహారాలు కట్టి వాటిని అందుకునే ప్రయత్నంలో గ్రామమంతా సంబురాల్లో మునిగిపోయింది.

టేకులపల్లి: మండలంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో తల్లిదండ్రులు తమ చిన్నారులను చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణ చేసి మురిసిపోయారు.




టేకులపల్లి: కోయగూడెంలో, కొత్తగూడెంలో..



ఇల్లెందురూరల్: నాయకులగూడెంలో ఉట్టి కొడుతున్న ఆదివాసీలు



శ్రీకృష్ణుడి ఆలయంలో పూజ చేస్తున్న ఆదివాసీలు



కొత్తగూడెంలో...,



టేకులపల్లిలో...



ఇల్లెందురూరల్: గోపిక వేషధారణలో చిన్నారి



కొత్తగూడెంఅర్బన్: రాధ అలంకరణలలో చిన్నారి



టేకులపల్లి: రేగులతండాలో చిన్ని కృష్ణులు, గోపికల సందడి



ఇల్లెందురూరల్: వెన్న ఆరగిస్తున్న బాలకృష్ణుడు




జూలూరుపాడులో.. చిన్నారులు

అభివృద్ధి పనుల పరిశీలన



పరిశీలిస్తున్న జీఎం జాన్‌ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఏరియా జీఎం జాన్ ఆనంద్ సందర్శించి పరిశీలించారు. సోమవారం 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలోని వాకింగ్ ట్రాక్, ఫుట్‌బాల్ కోర్టు, క్రికెట్ పిచ్‌ను పరిశీలించారు. అనంతరం 24 ఏరియా కమ్యూనిటీ హాల్ మరమ్మతులను పరిశీలించారు. జేకే కాలనీలో బాస్కెట్ బాల్ కోర్టు, ఓపెన్ జిమ్, నూతనంగా నిర్మించే పార్క్ స్థలాన్ని పరిశీలించారు. సింగరేణి పాఠశాల సందర్శించి తరగతి గదులను పరిశీలించి ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ఎస్‌సీ(వర్క్‌షాప్) నాగరాజు నాయక్, సివిల్ ఇంజనీర్ వెంకటేష్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల హామీ నెరవేర్చాలి



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయిస్తామన్న హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ డిమాండ్ చేశారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికే ఎనిమిది నెలలు గడిచినందున ఇళ్ల స్థలాలు మంజూరు చేయడమే కాక ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో మాలోత్ వీరూనాయక్, వంగా రవిశంకర్, వినయ్, బాబీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని లచ్యాతండా, సింగ్యాతండా, రావులపాడు, ఇప్పలతండా, బోడు, ముక్కంపాడు తండా, టేకులగుంపు, ముత్యాలంపాడు గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి వైద్యం అందించారు. ప్రస్తుతం ప్రబలుతున్న చికెన్ గున్యా మరియు వైరల్ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిశుభ్రమైన ఆహారం, నీరు తీసుకోవడం వల్ల చాలా వరకు వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని సూచించారు. వ్యాధులు ప్రబలిన తర్వాత బాధపడే కంటే ముందు జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాధులపై అవగాహన కలిగి ఉండడం ముఖ్యమని సూచించారు. ఈ శిబిరాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రకళ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు అమూల్య, రక్షణ, శైలజ, సూపర్‌వైజర్లు గుజ్జా విజయ, కౌసల్య సింగ్, పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు సులోచన, రమాకుమారి, వెంకటరమణ, చంద్రకళ, సుజాత, కృష్ణవేణి, అరుణాదేవి పాల్గొన్నారు.

అల్లర్లు జరిగితే కఠిన చర్యలు

ఇల్లెందు: గణేష్ ఉత్సవాలు, దేవీ నవరాత్రుల ఉత్సవాలలో డీజేలకు అనుమతులు ఉండవని డీఎస్పీ ఎన్.చంద్రభాను అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలకు, డీజేల నిర్వాహకులకు పలు సలహాలు సూచనలు చేశారు. ఉత్సవ కమిటీల వద్ద ముందస్తుగా ఎటువంటి అడ్వాన్స్‌లు, ఉత్సవ కమిటీలకు డీజే పెడతామని మాట ఇవ్వరాదన్నారు. పోలీసు శాఖ అనుమతులు లేకుండా ఉత్సవ కమిటీలు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని చెప్పారు. పట్టణంలోని 12 మంది డీజే నిర్వాహకులు, ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్‌ఐ సూర్య పాల్గొన్నారు.

జ్వరాలతో వణుకుతున్న గిరిజనం



ఓ ఇంట్లో జ్వరంతో బాధపడుతున్న మహిళలు

సుజాతనగర్: సుజాతనగర్ మండలంలోని జామ్లా తండా శివారు గ్రామాన్ని 15 రోజులుగా విష జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. సీజనల్ వ్యాధుల బారిన పడిన జనం మంచం పట్టారు. గ్రామంలో సుమారు 200 మంది విషజ్వరాల బారిన పడ్డారు. కీళ్లు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. ప్రతీ ఇంట్లో ఇద్దరు, ముగ్గురు బాధితులున్నారు. మొదట ఒళ్లు నొప్పులతో ప్రారంభమై జ్వరం వచ్చి తగ్గకపోవడంతో బాధితులు బాగా నీరసించి మంచానికే పరిమితం అవుతున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు సోకాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కనీసం వైద్య సిబ్బంది అయినా పట్టించుకోవడం లేదని, జ్వరాలతో కాలినడకన వైద్యానికి వెళ్లలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం మొదలైనప్పటి నుంచి గ్రామంలో బ్లీచింగ్ చల్లలేదని, ఫాగింగ్, దోమలమందు కూడా పిచికారీ చేయలేదని తెలిపారు. జ్వరాలతో పాటు ముఖంపై ఎర్రటి మచ్చలు వస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జ్వరాల కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

టేకులపల్లి: బొమ్మనపల్లి – కొత్తతండా క్రాస్‌రోడ్ మధ్యలో ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరింది. ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గం గుండానే కొత్తతండా, మంగ్యాతండా, సూర్యాతండా, చంద్రుతండా, గోప్యాతండా, రాజుతండా, శంభునిగూడెం, గుండ్లమడుగు గ్రామాలకు రాకపోకలు సాగుతుండేవి. ఈ సమస్యపై పలుమార్లు సాక్షిలో వార్తా కథనాలు కూడా ప్రచురితం అయ్యాయి. ఎట్టకేలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్యల ప్రత్యేక చొరవతో బ్రిడ్జి నిర్మాణానికి రూ.40లక్షలు మంజూరయ్యాయి.

ఈనెల 30న శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు సోమవారం పంచాయతీరాజ్ ఏఈ నవీన్, కాంట్రాక్టర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

మహిళలకు రక్షణ కల్పించాలి..



వైద్యవిద్యార్థిని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరిగి 18 రోజులు అవుతున్నా దోషులను అరెస్ట్ చేయలేదని, లైంగిక దాడులకు ప్రభుత్వ వైఫల్యాలే కారణమని సీపీఐ(ఎంఎల్) ఎన్‌డీ ఖమ్మం, వరంగల్ ఏరియాల జిల్లాల నాయకులు జే.సీతారామయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఇఫ్టూ కార్యాలయంలో ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో వైద్య విద్యార్థిని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. మాట్లాడుతూ.. బెంగాల్ అర్జికార్ ప్రభుత్వ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై ఆగస్టు 9న ఆస్పత్రిలోనే అత్యచారం, హత్య చేశారని ఇంతవరకు దోషులను అరెస్ట్ చేయకుండా కాపాడేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ప్రతీరోజు సుమారు 80 మంది మహిళలపై లైంగిక దాడి జరుగుతోందని, రోజులో ప్రతీ 20 నిముషాలకు ఒక మహిళపై అత్యాచారం, హత్యలు జరుగుతున్నాయని, దేశంలో పాలకులు మహిళలకు ఎలాంటి రక్షణ కల్పిస్తున్నారో అర్థం అవుతోందని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా పాలకులకు బుద్ధి రావటం లేదని, దేశ వ్యాప్తంగా మహిళలపై దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బెంగాల్ ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన దారుణ హత్యలో పాల్గొన్న దోషులను కాపాడేందేందుకు ప్రభుత్వాలే పూనుకోవటం వల్లనే ఆస్పత్రిపై దాడిచేసి విధ్వంసం సృష్టించారని, ఆందోళన చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారని, సాక్ష్యాధారాలు లేకుండా చేసే లక్ష్యంతో జరిగిన ఈ దాడి వెనక ప్రభుత్వ హస్తం ఉందని ఆరోపించారు. ముగ్గురు ఆదివాసీ మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించిన బీజేపీ మతోన్మాద శక్తులు రెండేళ్లుగా మణిపూర్‌లో మారణహోమం సృష్టిస్తున్నారని విమర్శించారు. దేశంలో ఆదివాసీ, దళిత, గిరిజన మహిళలపై జరుగుతున్న విచ్చలవిడిగా లైంగిక దాడులకు ప్రభుత్వాలదే పూర్తిబాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ నాయకులు ఎండీ రాసుద్దీన్, జీఎల్‌బీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అలీమొద్దీన్, సంజీవరావు, వి.సురేష్, బి.హర్షా, రావురి ఉపేందర్ పాల్గొన్నారు.

ఆధార్‌తో అధికారుల బేజార్..

- ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తప్పని అంగీకారం
- యూరియా విక్రయాల అక్రమాల్లో అదే కీలకం
- లొసుగులు అడ్డు పెట్టుకుని నల్లబజార్‌కు చేరుతున్న ఎరువులు



విక్రయానికి సిద్ధంగా యూరియా బస్తాలు

ఇల్లెందురూరల్: ఆధార్.. ప్రస్తుతం ప్రభుత్వ పరంగా ఏ పని జరగాలన్నా.. ప్రధాన ప్రామాణికంగా నిలుస్తోంది. కానీ సహకార శాఖలో రైతు ఆధార్ నంబర్ నమోదు చేయించుకుంటేనే యూరియా విక్రయాలు జరిగేలా అధికారులు పెట్టిన నిబంధన అక్రమాలకు రాచబాట వేసిందన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇందుకు తాజాగా యూరియా విక్రయాలలో ఇల్లెందులో వెలుగుచూస్తున్న అక్రమాలే.

యూరియా కేటాయింపు ఇలా..

మండలాల వారీగా వ్యవసాయ సాగు విస్తీర్ణం ఆధారంగా ప్రభుత్వం యూరియా కేటాయింపులు చేపడుతుంది. ఇల్లెందు మండలంలో సుమారుగా 25వేల ఎకరాలలో మొక్కజొన్న, 13వేల ఎకరాలలో పత్తి, 8వేల ఎకరాలలో వరి పంటలు ప్రధానంగా సాగయ్యాయి. ఈ లెక్క ప్రకారం ప్రస్తుత సీజన్‌లో సెప్టెంబర్ నెలాఖరు నాటికి 4,062 టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉంది. కానీ ఆగస్టు 25వ తేదీ నాటికి ఇల్లెందుకు 3,734 టన్నులు సరఫరా జరిగింది. ఇంకా మిగిలిన 35 రోజులకు గాను ఇంకా 328 టన్నులు సరఫరా జరగాల్సి ఉంది.

విక్రయాలకు నిబంధనలు..

మండలానికి కేటాయించిన 4,062 టన్నుల యూరియాను 40 శాతం ప్రైవేటు వ్యాపారుల ద్వారా, 60 శాతం పీఏసీఎస్ ద్వారా విక్రయాలు జరిగేలా నిబంధనల రూపొందించారు. అయితే రైతుకు యూరియా విక్రయించేందుకు వ్యాపారులు, పీఏసీఎస్ అధికారులకు ప్రభుత్వం నిబంధన విధించింది. యూరియా అవసరమైన రైతు విధిగా తమ ఆధార్ పత్రాన్ని వెంట తెచ్చుకొని నమోదు చేయించుకోవాలి. పీవైసీ యంత్రంపై తంబ్ వేసిన తరువాతే సదరు రైతుకు ఐదు బస్తాల యూరియా ఇవ్వాల్సి ఉంటుంది.

రాచబాటలోనే అక్రమాలు..

ఆధార్ నంబర్ నమోదు చేయించుకొని పీవైసీ యంత్రంలో తంబ్ వేస్తే ఐదు బస్తాల యూరియా ఇచ్చేలా ప్రభుత్వం విధించిన నిబంధనను దళారులు అక్రమాలకు రాచబాటగా వినియోగించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆధార్‌తో వచ్చిన వ్యక్తి రైతా.. కాదా.. అని పరిశీలించాల్సిన అవసరం లేకుండానే యూరియా విక్రయస్తుండడంతో కొంతమంది వ్యాపారులు తమకు పరిచయం ఉన్న వ్యక్తుల ఆధార్ పత్రాలు సేకరించి నేరుగా పీఏసీఎస్ గోదాము వద్ద కొనుగోలు చేపట్టి తమకు సంబంధించిన గోదాములకు తరలించి రాజమార్గంలోనే అధిక ధరలకు విక్రయించుకుంటున్నారు.

ఖద్దరు చాటు సిబ్బంది కావడం వల్లే..

ప్రాథమిక సొసైటీలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం నుంచి నేరుగా వేతనాలు అందవు. సొసైటీ ద్వారా చేపట్టే వ్యవసాయ అనుబంధ సామగ్రి క్రయవిక్రయాలతో వచ్చిన లాభాలనే వేతనంగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ఎన్నుకోబడిన పాలకవర్గాలు ఉండటంతో సహజంగానే ఖద్దరు చొక్కా నేతలు, ప్రజాప్రతినిధులు, పలుకుబడి కలిగిన వారి కనుసన్నల్లో పనిచేయాల్సిన దుస్థితి పీఏసీఎస్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి తప్పదు. వారి ఆదేశాలను జీ..హుజూర్ అన్నట్లుగా అమలు చేయకతప్పని పరిస్థితి సందర్భం ఏదైనా వారికి తప్పదు. లేకపోతే సస్పెన్షన్లు, వేధింపులు వారికి తప్పవన్న విమర్శలు లేకపోలేదు. ఇలాంటి దయనీయ స్థితిలో విధులు నిర్వహించే అధికారులకు యూరియా విక్రయాలలో లోపభూయిష్ట నిబంధనలు శాపంగా మారాయి.

వ్యవసాయశాఖ ధృవీకరణతోనే..

సాధారణంగా రైతులు ఎవరు.. ఇతరులు ఎవరు అని స్పష్టమైన అవగాహన కేవలం వ్యవసాయశాఖ అధికారులకే ఉంటుంది. యూరియా విక్రయాలలో ఆధార్ కార్డు నిబంధన, పీవైసీ యంత్రంపై తంబ్ వేయడంతోపాటు వ్యవసాయశాఖ అధికారుల ఆమోద పత్రం కూడా విధించి ఉంటే అక్రమాలకు చెక్‌పడే అవకాశం ఉండేది. కానీ రైతు గుర్తింపు అవకాశం లేకపోవడంతో యూరియాతో అవసరం ఉన్నా.. లేకున్నా.. ఆధార్ పత్రం ఉన్న వారికి యూరియా విక్రయాలు చేస్తుండటంతో సహజంగానే అవి నల్లబజారుకు చేరుకుంటున్నాయి. ఈ లోపాన్ని అధిగమించేందుకు ఉన్నతాధికారులు నిబంధనలలో మార్పులు చేస్తే అక్రమాలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుంది.

నిబంధనల్లో మార్పు అవసరం..

పీఏసీఎస్‌లో యూరియా విక్రయాలకు సంబంధించి నిబంధనలలో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. విక్రయాలు మాత్రమే సహకార శాఖ పర్యవేక్షిస్తుంది. విక్రయ నిబంధనలను వ్యవసాయశాఖ రూపొందిస్తుంది. తాజా నిబంధనలు అక్రమాలకు ఊతమిచ్చేలా ఉండటం కారణంగా మార్పుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– ఖుర్షీద్, జిల్లా సహకార అధికారి, భద్రాద్రి జిల్లా